## క్లుప్తంగా

### ఆర్థిక సాయం అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం గట్లఖానాపూర్‌కు చెందిన మేకల నర్సింహ్మా (55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. ఈ విషయాన్ని స్థానిక టీఎమ్మార్ సభ్యుడు నర్సింహ ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే స్పందించిన ఆయన తక్షణ సాయంగా రూ.5 వేల నగదు పంపించారు. టీఎమ్మార్ సభ్యుడు నర్సింహ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును కుమారుడికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దామోదర్, మాజీ సర్పంచ్ వెంకటేష్, తిరుపతియాదవ్, మహేష్, బాలరాజు, వెంకటయ్య, దేవేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

వీపనగండ్ల: మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కతలప్ప తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని కోరారు.

### 284 మందికి కంటి పరీక్షలు

పాన్‌గల్: మండలంలోని మాధవరావుపల్లి, జమ్మాపూర్‌లో గురువారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరంలో 284 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యుడు డా. హరినాథ్‌రెడ్డి తెలిపారు. 23 మందికి కంటి అద్దాలు, ఆరుగురిని శస్త్రచికిత్స నిమిత్తం సిఫార్సు చేసినట్లు వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొనేలా సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### షీటీంపై అవగాహన

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో షీటీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎస్‌ఐ స్వాతి, రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ స్వాతి మాట్లాడుతూ... మహిళల భద్రత షీటీం ప్రధాన కర్తవ్యమని, ఎక్కడైనా వేధింపులు, ఈవ్‌టీజింగ్‌కు గురైతే వెంటనే సెల్‌ఫోన్ నంబర్ 63039 23211 సంప్రదించాలన్నారు. ఎస్‌ఐ రాములు మాట్లాడుతూ... మైనర్లు వాహనాలు నడపరాదని, వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనం నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సోషల్ మీడియాలో అనవసర పోస్టులు నమోదు చేసి జీవితాలను నాశనం చేసుకోవద్దని, చదువుపై దృష్టి సారించాలని సూచించారు.

### రేషన్ డీలర్ల నిరసన బాట

వీపనగండ్ల: గౌరవ వేతనం చెల్లించాలంటూ గురువారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి రేషన్ డీలర్ల సమావేశానికి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల డీలర్లు తరలివెళ్లారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో గ్రామీణ డీలర్లు చాలీచాలని వేతనాలతో జీవితాలను వెళ్లదీస్తున్నారని సంఘం నాయకులు సుధాకర్‌రెడ్డి, బస్వరాజ్‌గౌడ్, సింగయ్యశెట్టి తెలిపారు.

### ఓటరు నమోదులో బీఎల్వోలే కీలకం

వీపనగండ్ల: అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయించి జాబితాలో తప్పొప్పులను సరిచేయడంలో బీఎల్వోలు కీలకంగా వ్యవహరించాలని తహసీల్దార్ పాండూనాయక్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. చనిపోయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించడం, తప్పొప్పులను సరిచేయడం, ఆధార్‌కార్డు అనుసంధానం తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో బీఎల్వోలు సుగుణాబాయి, సువర్ణ, కృష్ణమ్మ, ఎల్లమ్మ, లక్ష్మి, మాధవి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

### కేసు నమోదు

గోపాల్‌పేట: మండల కేంద్రంలో బుధవారం బొలెరో వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి ఐదుగురిని గాయపర్చిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. గాయపడిన కిరణ్‌కుమారి భర్త బోడోళ్ల రాజు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

### విద్యుదాఘాతంతో గేదె మృతి

చిన్నంబావి: మండలంలోని అమ్మాయిపల్లిలో బోయ ఈశ్వరయ్యకు చెందిన గేదె గురువారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదెను మేపడానికి పొలాల్లోకి వదలగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందిందని బాధితుడు తెలిపారు. గేదె విలువ రూ.40 వేలు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి

భారీగా హాజరైన సగరులు, వివిధ పార్టీల నాయకులు



కొత్తకోట ర్యాలీలో పాల్గొన్న సగరులు, వివిధ పార్టీల నాయకులు

కొత్తకోట: పట్టణంలో గురువారం పట్టణ సగర (ఉప్పర) సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబాభవాని ఆలయం నుంచి బైపాస్ సమీపంలో ఉన్న భగీరథ మహర్షి విగ్రహం వరకు నిర్వహించిన ఊరేగింపులో సగరులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, పాలమూరు డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ ప్రధానకార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, బీజేపీ జిల్లా నాయకుడు బాలన్న పాల్గొని మాట్లాడారు. పవిత్ర గంగను దివి నుంచి భువికి తీసుకొచ్చిన మహనీయుడు భగీరథుడని కొనియాడారు. పట్టుదలకు మారుపేరని.. ఆయన అపర భగీరథుడిగా పేరొందినట్లు చెప్పారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని యువత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బుచ్చన్న, యువజన సంఘం అధ్యక్షుడు సురేష్, సగరుల మేస్త్రీ శ్రీనివాసులు, యాదయ్య సాగర్, టైలర్ శ్రీనివాసులు, వినోద్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో..**

వనపర్తిటౌన్: ఎన్ని కష్టాలు ఎదురైనా.. పట్టు వదలకుండా కార్యాన్ని సాధించడానికి భగీరథ చేసిన ప్రయత్నం జీవితంలో మనకు ఓ మంచి పాఠమని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, విభూది ఈశ్వర్, బండలయ్య, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు గంధం ఆంజనేయులు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు గంగాధరాచారి, ముదిరాజ్ సంఘం నాయకుడు శివకుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరంగాపురంలో..

**సగర సంఘం ఆధ్వర్యంలో..**

పెబ్బేరు: పట్టణంలో సగర సంఘం ఆధ్వర్యంలో గురువారం భగీరథ మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం రోడ్‌లో ఉన్న భగీరథ మహర్షి విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి మాట్లాడారు. కార్యక్రమంలో సగర సంఘం మండల నాయకులు, యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**తహసీల్దార్ కార్యాలయంలో..**

పాన్‌గల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణి పూలమాల వేసి మాట్లాడారు. భగీరథుడిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో..**

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురంలో కాంగ్రెస్‌పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో కుమ్మరి గోవిందు, రాములు యాదవ్, పురుషోత్తంయాదవ్, అశోక్‌కుమార్, శివసాగర్, వెంకటేష్ సాగర్, సురేష్, శివబాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో..



పెబ్బేరులో సగర సంఘం నాయకులు



పాన్‌గల్ తహసీల్దార్ కార్యాలయంలో..

## రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం



ఆరేపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

అమరచింత: రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని.. పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధర కొనుగోలు చేయడానికే కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, సింగిల్‌విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూర్ మండలం ఆరేపల్లి, కత్తేపల్లి, తూంపల్లి, రేచింతలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులకు పెట్టుబడి సాయంతో పాటు గిట్టుబాటు ధరకు రైతు నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. రైతుల కోసం ఏ రాష్ట్రంలో లేని పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణాను ముందువరుసలో నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని తెలిపారు. దళారులను నమ్మి మోసపోరాదని.. కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోటేశ్వర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు అనసూయమ్మ, విజయలక్ష్మి, లక్ష్మీకాంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : బీఎస్పీ

పెబ్బేరు రూరల్: అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీఎస్పీ జిల్లా కార్యదర్శి బహుజన రమేష్ డిమాండ్ చేశారు. గురువారం శ్రీరంగాపురంలోని కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు ఆత్మీయ సమ్మేళనాల మత్తులో మునిగి రైతులను గాలికొదిలేశారని ఆరోపించారు. ధాన్యంపై కప్పేందుకు కనీసం టార్పాలిన్లు కూడా ఇవ్వలేని ప్రభుత్వం రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొంటామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తడిసిన వరి ధాన్యాన్ని ఎలాంటి తరుగు లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. ఆయనవెంట ఎంపీటీసీ సభ్యుడు ఎల్లస్వామి, నాయకులు చంద్రశేఖర్, బీసన్న, భాస్కర్, నాయకులు ఉన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

## బీజేపీలో చేరిక

వనపర్తి: జిల్లాకేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన పలువురు మహిళలు, యువకులు గురువారం బీజేపీలో చేరారు. వారికి పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై కాలనీకి చెందిన మహేష్ ఆధ్వర్యంలో 11 మంది యువకులు, 15 మంది మహిళలు పార్టీలో చేరారని వెల్లడించారు. రాబోయే రోజుల్లో ప్రతి వార్డులో చేరికల కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేవైఎం కార్యదర్శి రాజశేఖర్, సీనియర్ నాయకులు పికిలి రాము, సందీప్, లోకేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కరపత్రాలు విడుదల

వనపర్తిటౌన్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 29న జరిగే పూలే, అంబేడ్కర్ రాష్ట్రస్థాయి జనజాతర సభను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి దయ్యపు రాధాకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం ఎదుట జనజాతరకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ప్రజలను చైతన్యం చేయడానికి జనజాతర సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ నాయకుడు దేవేందర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్, వ్య.కా.సం. జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జేవీవీ నాయకుడు జితేందర్, సీఐటీయూ నాయకులు రాజు, ఆంజనేయులు, రైతు సంఘం నాయకుడు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సూగూర్‌ను మండలం చేయాలని నిరసన

పెబ్బేరు: సూగూర్‌ను మండలం చేయాలంటూ గురువారం గ్రామస్తులు నిరసన చేపట్టారు. వీరికి బూడిదపాడు, ఈర్లదిన్నె ప్రజాప్రతినిధులు, ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటస్వామి, జూదం వెంకటేష్, భాగమ్మ, పద్మ, నాయకులు కురుమూర్తి, రాజశేఖర్‌గౌడ్, పరశురాం, చాకలి మధు, రెండు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 11వ రోజుకు చేరిన వీఓఏల సమ్మె



కొత్తకోటలో మద్దతు తెలుపుతున్న కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్

కొత్తకోట: ఐకేపీలో విధులు నిర్వర్తించే గ్రామ సంఘం సహాయకులు (వీవోఏలు) చేస్తున్న సమ్మె గురువారం 11వ రోజుకు చేరింది. స్థానిక జరుగుతున్న సమ్మెకు కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వీవోఏలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా.. అధికారపార్టీ నాయకులు ఏ ఒక్కరూ మద్దతు తెలపకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సంఘం మండల అధ్యక్షుడు నర్సింహ ఆయనకు అందజేశారు. వీఓఏలకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, కాంగ్రెస్ నాయకుడు నరోత్తంరెడ్డి మద్దతు తెలిపారు. సమ్మెలో సంఘం మండల అధ్యక్షుడు నర్సింహ, ప్రధానకార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు అరుణ, కోశాధికారి శ్రీలత, వీఓఏలు మంజులత, పల్లవి, విమల, నీరజ, శివాని పాల్గొన్నారు.

**మోకాళ్లపై నిలబడి నిరసన..**

అమరచింత: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద గురువారం వీఓఏలు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వీఓఏల సమస్యలు పరిష్కరించకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుతోందని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు ఉద్యమం ఆగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీహరి అన్నారు. కార్యక్రమంలో కురుమూర్తి, బాలస్వామి, రవి, పావని, రంగన్న, పావని, రాధ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న వీఓఏలు

**రేవల్లిలో..**

గోపాల్‌పేట: వీఓఏల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు పర్వతాలు డిమాండ్ చేశారు. గురువారం రేవల్లిలో వీఓఏల నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సుల్తాన్, అంజనమ్మ, రాములు, వల్లమ్మ, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: డిమాండ్ల సాధన కోసం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 11వ రోజుకు చేరింది. సమ్మెకు సీఐటీయూ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం అమలు చేయాలని, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలు క్రమం తప్పకుండా చెల్లించాలని, అర్హులైన వీఓఏలకు సీసీగా పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజయ్యగౌడ్, శ్రీనివాసులు, భాగ్యమ్మ, స్వరూపారాణి, బాలరాజు, నరేష్, శేషయ్య, పద్మ, కృష్ణయ్య పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించకుండా ధాన్యం సేకరించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని మల్లాయిపల్లి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ధాన్యం తూకం చేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్రాల్లో రైతులకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని, తేమ శాతం పేరుతో తూకాల్లో జాప్యం చేయొద్దని సూచించారు. అకాల వర్షానికి ధాన్యం తడిసిందా.. గన్నీబ్యాగులు సరిపడా ఉన్నాయా లేవా అనే విషయాలను ఆరా తీశారు. ఆయనవెంట వీఆర్‌ఏ వెంకటయ్య, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.



ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ చక్రపాణి

## మన ఊరు-మన బడి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ ప్రాథమికోన్నత, రేమద్దుల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చేపట్టిన మన ఊరు-మన బడి పనులను గురువారం ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, పీఆర్ ఏఈ సత్యం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనల మేరకు పనులు నాణ్యతగా, త్వరగా పూర్తి చేయాలన్నారు. వారి వెంట ఆయా గ్రామాల సర్పంచ్‌లు మంజుల, రాణి, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్లు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

## సైబర్ వలకు చిక్కిన బ్యాంకుమిత్ర

రూ.24 వేలు కాజేసిన వైనం

ఖిల్లాఘనపురం: 'హలో బ్యాంకుమిత్ర వెంకట్‌రెడ్డి .. నేను ఏఎస్సై అశోక్‌రెడ్డిని మాట్లాడుతున్నా.. నా ఫ్రెండ్ ఆస్పత్రిలో ఉన్నాడు నేను ఫోన్‌నంబర్ చెబుతున్నా.. వెంటనే రూ.24 వేలు ఫోన్‌పే ద్వారా పంపించు.. నేను నీకు డబ్బులు పంపుతున్నా' అంటూ ఓ వ్యక్తి నుంచి రూ.24 వేలు కాజేసిన ఘటన మండలంలోని మల్కిమియాన్‌పల్లిలో మార్చి 10న జరగగా ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొంకల వెంకట్‌రెడ్డి మల్కిమియాన్‌పల్లిలో ఏపీజీవీబీ బ్యాంకు మిత్రగా పనిచేస్తున్నారు. అతడికి మార్చి 10న సాయంత్రం సెల్‌ఫోన్ నంబర్ 76739 41381 నుంచి ఫోన్ వచ్చింది. ఏఎస్సై అశోక్‌రెడ్డిని మాట్లాడుతున్నానని.. 99121 18829 నంబర్‌కు వెంటనే ఫోన్‌పే ద్వారా రూ.24 వేలు పంపాలని, డబ్బులు నీకు పంపిస్తానని నమ్మబలికాడు. నిజమే అనుకున్న వెంకట్‌రెడ్డి అతను పంపిన నంబర్‌కు డబ్బులు పంపించారు. కాని తన దగ్గరకు డబ్బులు తీసుకొని ఎవరూ రాకపోవడంతో వెంటనే ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. తరువాత పలుమార్లు ఫోన్‌చేసినా అదే సమాధానం రావడంతో అనుమానం వచ్చి చివరకు ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆరా తీశారు. ఏఎస్సై అశోక్‌రెడ్డి ఎవరూ లేరని సిబ్బంది చెప్పడంతో మోసపోయాయని తెలుసుకొని చేసేది లేక గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

## గొర్రెల పంపిణీపై లబ్ధిదారులకు అవగాహన



మాట్లాడుతున్న మండల పశువైద్యాధికారి డా.శ్యామ్

పాన్‌గల్: రెండోవిడత గొర్రెల పంపిణీపై గురువారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు మండల పశువైద్యాధికారి డా.శ్యామ్ అవగాహన కల్పించారు. ఒక్కో లబ్ధిదారు రూ. 43,500 చెల్లిస్తే మిగతాది ప్రభుత్వం చెల్లిస్తుందని.. 20 గొర్రెలు, ఒక పొట్టేలు అందజేయనున్నట్లు వివరించారు. డబ్బులను లబ్ధిదారుడి బ్యాంకు ఖాతా నుంచి నేరుగా కలెక్టర్ ఖాతాకు బదిలీ చేస్తామని తెలిపారు. మండల కేంద్రంలో 107 మంది లబ్ధిదారులు ఉన్నారని.. ఆధార్‌కార్డు, బ్యాంక్‌ఖాతా పుస్తకం, కుల ధ్రువీకరణపత్రం జిరాక్స్ ప్రతులతో సంఘం అధ్యక్షులు, మండల పశు వైద్యశాలలో అందజేయాలని సూచించారు. సమావేశంలో గొర్రెల కాపరుల సంఘం జిల్లా డైరెక్టర్ తిరుమల్‌యాదవ్, నాయకులు ఈశ్వరయ్యయాదవ్, రాముయాదవ్, చంద్రయ్యయాదవ్, నిరంజన్‌యాదవ్, రాములు, విష్ణు, వేణు, బాలయ్య, మన్యం తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

పాన్‌గల్: హమాలీలు, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటుచేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము అన్నారు. గురువారం మండలంలోని బుసిరెడ్డిపల్లిలో ఈ నెల 29న హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 50 కిలోలకు మించిన బరువు నిషేధం, కనీస వేతన అమలు, పీఎఫ్, ఈఎస్‌ఐ, పింఛన్ వంటి చట్టబద్ధ హక్కుల కల్పన, ప్రభుత్వ గోదాముల్లో పనిచేస్తున్న హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తింపు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు తదితర సమస్యల పరిష్కారానికి చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి కార్మికులు అధికసంఖ్యలో తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హమాలీల సంఘం నాయకులు పరమేష్, స్వామి, దేవేందర్, బాలస్వామి, నాగరాజు, వెంకటయ్య, నాగేంద్రం, రవి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా నాయకులు

## రక్తదానం.. మహాదానం



రక్తదానం చేస్తున్న యువత

అమరచింత: అన్నిదానాల కన్నా రక్తదానం ఎంతో గొప్పదని నీలగిరి శాలిమఠం రాయచూర్ పీఠాధిపతి సూగూరయ్య మహాస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. గురువారం పట్టణంలో శబరీనాథ్‌గౌడ్, అక్షయ స్మారకార్థం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని ఆస్పత్రుల్లో రక్తనిల్వలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. ప్రస్తుతం నిర్వహించిన రక్తదాన శిబిరం ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందన్నారు. యువత ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి రక్తనిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేందర్‌సింగ్, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు రమేష్ ముదిరాజ్ ,అక్కల నర్సింహులుగౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్, పుర కమిషనర్ మహ్మద్ ఖాజా, నాయకులు రఫీ, చిన్నబాలరాజు, మాకం నర్సింహులు, కేశవులు, నిర్వాహకులు కమలాకర్‌గౌడ్, పురుషోత్తంగౌడ్ పాల్గొన్నారు.

## ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని వినతి

మదనాపురం: వనపర్తి రోడ్ రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలంటూ గురువారం వనపర్తి అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతం నుంచి చెన్నై, బెంగుళూర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ప్రయాణికులు తమ వ్యాపారాల నిమిత్తం అధికంగా వెళ్తుంటారని, రైళ్లు నిలిపితే సౌకర్యంగా ఉంటుందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్, వెంకటేష్, ప్రయాణికులు తదితరులు ఉన్నారు.